నృసింహుడి సన్నిధిలో దీక్షలు

- 15 ఏళ్లుగా మాలలు వేసుకుంటున్న 40 మంది పత్తిపాక భక్తులు
- ఈనెల 26 నుంచి మే వరకు నృసింహుడి జయంతి ఉత్సవాలు


ధర్మపురిలో నృసింహుడి దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు (ఫైల్)

ధర్మపురి: ధర్మపురి లక్ష్మీనృసింహుడంటే ఎనలేని నమ్మకం. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం. ధర్మపురిలో స్వయంభూగా వెలసిన లక్ష్మీనృసింహుడిని పత్తిపాక భక్తులు ఇంటి ఇలవేల్పుగా కొలుస్తారు. అందుకే 15ఏళ్ల నుంచి నృసింహుడి మాలలు వేస్తూ మండల, అర్ధ మండలం, పావు మండలం దీక్షలు చేపట్టి స్వామి ఆరాధనలో గడుపుతారు.

ధర్మపురిలో మాలలు.. పత్తిపాకలో విరమణ

ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈనెల 26 నుంచి మే 4 వరకు నృసింహుడి జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. జయంతి ఉత్సవాల సందర్భంగా నృసింహుడి దీక్షలు చేపట్టే భక్తులు పసుపు వర్ణం దుస్తులు ధరించి మండల (41 రోజులు), అర్ధ మండలం (21 రోజులు), పావు మండలం (11రోజులు) దీక్షలు చేపడుతారు. అందుకు భక్తులంతా రోజులకు సరిపడే విధంగా మాలలు ధరిస్తారు. పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండలంలోని పత్తిపాకకు చెందిన సుమారు 40 మంది భక్తులు ప్రతి ఏటా చైత్ర, వైశాఖ మాసంలో వచ్చే నృసింహుడి జయంతి ఉత్సవాల సందర్భంగా మాలలు వేయడం ఆనవాయితీగా వస్తోంది. 15ఏళ్లలో ప్రతి సంవత్సరం లాగానే ఈసారి భక్తులంతా ధర్మపురి నృసింహుడి సన్నిధిలో మాలలు ధరించారు. మొదట పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి సన్నిధిలో బ్రాహ్మణ వేద పండితుల మంత్రోచ్చారణలతో మాలలు ధరించారు. ధర్మపురిలో మాలలు ధరించి మే 4న నిర్వహించే స్వామి జయంతి రోజున రోటిగూడెం మౌన స్వామి చేతుల మీదుగా పత్తిపాకలో మాల విరమణ చేస్తారు.

దీక్షా సమయంలో నియమ నిష్టలు..

దీక్షలు చేపట్టిన భక్తులంతా నియమ నిష్టలు పాటించడం ముఖ్యం. ప్రాతఃకాలం చన్నీటి స్నానం, నేలపై పడుకోవడం, ఒక్కపూట భోజనం, కాళ్లకు చెప్పులు ధరించక పోవడం, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అబద్ధాలు మాట్లాడొద్దు, ప్రతి జీవిలో స్వామివారిని చూసుకోవడం వంటి నియమాలను పాటించాలి.

ఇంటి దైవం లక్ష్మీనృసింహుడు



ధర్మపురి లక్ష్మీనృసింహుడు మా ఇంటి దైవం. 13 ఏళ్ల నుంచి స్వామి వారి జయంతి ఉత్సవాల సందర్భంగా మాల వేస్తాను. మెడలో మాల ఉన్నంత వరకు మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఆ నృసింహస్వామి మా కుటుంబాన్ని చల్లగా చూస్తాడు. ధర్మపురిలోని స్వామి సన్నిధిలో మాల వేసుకున్నాను.

– మల్లయ్య, పత్తిపాక

8 ఏళ్ల నుంచి మాల వేస్తున్న



ఎనిమిది ఏళ్ల నుంచి నృసింహుడి దీక్ష చేపడుతున్న. దీక్షా సమయంలో స్వామి ఆరాధనలోనే ఉంటాను. ప్రతి ఏటా పత్తిపాక నుంచి సుమారు 40 మంది భక్తులు నృసింహుడి దీక్షలు చేపడుతారు. ధర్మపురిలో మాలలు ధరించి పత్తిపాకలో రోటిగూడెం మౌన స్వామి చేతుల మీదుగా విరమణ చేస్తాం. దీక్షా కాలంలో మనుసు ప్రశాంతంగా ఉంటుంది.

– నర్సింహారెడ్డి, పత్తిపాక

క్లుప్తంగా

కోరుట్ల విద్యార్థులకు రాష్ట్రస్థాయి పతకాలు


అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ప్రతినిధులు

కోరుట్లటౌన్: రాష్ట్రస్థాయి ఎస్ఆర్ఎఫ్ ఒలింపియాడ్ పథకాలు పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ హైస్కూల్‌కు చెందిన 9 మంది విద్యార్థులు సాధించినట్లు ప్రిన్సిపాల్ నితిన్ గురువారం తెలిపారు. సీహెచ్.సహస్ర, ఇ.శ్రీకర్, వి.రసజ్ఞ ఇంగ్లిష్, విష్ణుప్రియ, పూజశ్రీలు సైన్స్, జి.పరిషత్ సీహెచ్.ఇషాంత్, ఎ.నిత్యశ్రీ, కె.సహస్ర గణితంలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అవార్డులు సొంతం చేసుకున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ప్రబంధకారిణి కార్యదర్శి వనపర్తి చంద్రమోహన్, కోశాధికారి నీలి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నితిన్‌కుమార్ అభినందించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ అలీఖాన్

జగిత్యాలక్రైం: రౌడీషీటర్లు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దని జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ సూచించారు. ఈ మేరకు గురువారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు పోలీసు శాఖ సమాచారం సేకరిస్తుందని, ఎలాంటి నేరాల్లో పాల్గొన్నా చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. రూరల్ ఎస్సై అనిల్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై పోలీసులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అంజిత్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో పోలీసులకు సీపీఆర్‌పై వైద్యాధికారి ఎల్లాల అంజిత్‌రెడ్డి అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైనప్పుడు శరీరంలో రక్తం, ఆక్సిజన్ సరాఫరా ఆగిపోతుందని ఆయన తెలిపారు. దీంతో గుండెనొప్పి వస్తుందని ఈ పరిస్థితిలో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడొచ్చని వివరించారు. వైద్యాధికారి శ్రీజ, ఎస్సై ఉమాసాగర్, సీహెచ్‌వో విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం లబ్ధిదారుల ఎంపిక


లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న తహసీల్దార్

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు రూరల్ తహసీల్దార్ నవీన్ తెలిపారు. ఈ మేరకు గురువారం మండలంలోని లక్ష్మీపూర్‌లో ప్రభుత్వం ద్వారా మంజూరైన 40 డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా గురువారం దరఖాస్తుదారుల సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకు జాన్ పాల్గొన్నారు.

సౌందర్యలహరిలో మహిళలకు శిక్షణ


శిక్షణ పొందుతున్న మహిళలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారి దేవాలయంలో గురువారం సౌందర్య లహరిలో మహిళలకు సంస్కృత శ్లోకాలపై శిక్షణ ఇచ్చారు. ఆసక్తి గల మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో పాత రాధ, నార్ల రజిని, గంప రజినీ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణలో అగ్నిమాపకశాఖ కీలకం


పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్


రాయికల్: చెరుకుతోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలక్రైం: అగ్నిప్రమాదాల నివారణలో అగ్నిమాపక శాఖ కీలకపాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వాడే వివిధ రకాల పరికరాలు, వాహనాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు 101కు ఫోన్ చేస్తే అగ్నిమాపక సిబ్బంది త్వరితగతిన చేరుకుని అగ్నిప్రమాదాలను నివారిస్తారన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కొమురయ్య, మున్సిపల్ ఇన్‌చార్జి గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ దాసరి లావణ్య, బొడ్ల రాజు, నారాయణరెడ్డి, గంగసాగర్, మల్లికార్జున్, కోఆప్షన్ మెంబర్ శ్రీనివాస్, ఆర్టీఏ జిల్లా మెంబర్ సుధాకర్‌రావు, నాయకులు శ్రీని వాస్, బద్దం జగన్మోహన్‌రెడ్డి, సత్యం, కిష్టయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

జగిత్యాల: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతతో చేపట్టాలని సూచించారు. నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు పద్మ, తోట మల్లికార్జున్ ఉన్నారు.

నష్ట పరిహారం అందేలా చూస్తాం

రాయికల్: పంటనష్టం పరిహారం అందేలా చూస్తామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం రాయికల్ మండలం సింగరావుపేటకు చెందిన గాజర్ల రవిగౌడ్ అనే రైతు చెరుకు తోట ప్రమాదవశాత్తు దగ్ధం కాగా ఎమ్మెల్యే పరిశీలించారు. పంటనష్ట నివేదికను ప్రభుత్వానికి త్వరితగతిన అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సర్పంచ్ రాంచందర్‌రావు, ఎంపీటీసీ సాగరిక, కోఆప్షన్ మెంబర్ మొఖిద్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ రాజలింగం, నాయకులు బర్కం మల్లేశం, మోర వెంకటేశ్, జలపతిరెడ్డి, అశోక్, వేణు, లక్ష్మణ్, దేవయ్య పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే ప్రమాదాల నివారణ


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై రాము

జగిత్యాలక్రైం: డ్రైవర్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ట్రాఫిక్ ఎస్సై రాము అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లాలోని లారీ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీ డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. మద్యం మత్తులో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు ఖలీం, ఉపాధ్యక్షుడు కొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మరాయి సోస్ పాల్గొన్నారు.

తల్లులకు పాదపూజ


తల్లులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు గురువారం వీడ్కోలు పార్టీ నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థులు పాఠశాలలో తల్లులకు పాద పూజ చేశారు. సర్పంచ్ గడీల గంగప్రసాద్, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఎస్ఎంసీ చైర్మన్ పంజాల ప్రసాద్, హెచ్ఎం వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు


మాట్లాడుతున్న ఎస్సై ఉమసాగర్

ఇబ్రహీంపట్నం: పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్సై ఉమసాగర్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఎర్దండిలో బుధవారం రాత్రి పోలీస్ కళాబృందంతో గ్రామస్తులకు డయల్ 100, మోటార్ వెహికల్ యాక్ట్, సైబర్ క్రైమ్, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై రాములు, కానిస్టేబుల్ రాజేందర్, జిల్లా పోలీస్ కళాబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి


మాట్లాడుతున్న డాక్టర్ శైలేందర్‌రెడ్డి

సారంగాపూర్: గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ శైలేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండలంలోని రేచపల్లి గ్రామ జగన్నాథస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కేంద్రాలను రెండు రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ నాయకులు పోచన్న ఉన్నారు.

ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, గంభీర్‌పూర్ గ్రామాల్లో ముస్లింలకు గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. అనంతరం ముస్లింలకు ప్రభుత్వం సరఫరా చేసిన రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. సర్పంచులు కూన సులోచన, పోతు సింధూజ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల: ప్రభుత్వ ఆక్రమిత భూములు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు సంబంధిత ఆక్రమణలో ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సుజాత అన్నారు. ప్రభుత్వ జీవో నంబర్ 58, 59 ప్రకారం ప్రభుత్వ భూమిలో కబ్జాలో ఉన్న వారు భూమి క్రమబద్ధీకరణ కోసం 30లోగా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

✦ విద్యుత్ షాక్‌తో గొర్రె మృతి

కోరుట్లరూరల్: మండలంలోని నాగులపేట శివారులో గురువారం విద్యుత్ షాక్‌తో జాల మొండయ్యకు చెందిన గొర్రె మృతి చెందిందని విద్యుత్ సిబ్బంది తెలిపారు. నాగులపేట శివారులోని సైఫన్ ప్రాంతంలో మొండయ్య గొర్రెలు మేపుతుండగా అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ తీగకు విద్యుత్ రిటర్న్ రావటంతో ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. గొర్రె విలువ రూ.10వేలు ఉంటుందని, పరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

✦ నిరుపేద మహిళలకు సామగ్రి

రాయికల్: పట్టణంలోని 6వ వార్డులో నిరుపేద మైనార్టీ మహిళలకు ఎంటీకేఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం రంజాన్ పండగ సందర్భంగా వంటసామగ్రి అందజేశారు. కౌన్సిలర్ అన్వరిబేగం, నాయకులు సఫీ, ఇమ్రాన్, రాహూఫ్ పాల్గొన్నారు.

✦ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కథలాపూర్: మండలంలోని దూలూర్, పోసానిపేట, కథలాపూర్, అంబారిపేట కలిగోట, ఇప్పపెల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ గుండారపు సౌజన్య, వైస్ చైర్మన్ సోమ దేవేందర్‌రెడ్డి, సర్పంచులు కంటె నీరజ, ఎంజీ రెడ్డి, దయ్య లక్ష్మీనర్సయ్య, గోపు శ్రీనివాస్, చీటి విద్యాసాగర్‌రావు, వేముల గంగరాజం, నల్ల గంగాధర్ పాల్గొన్నారు.

✦ గోదావరి నది వైపు వెళ్లొద్దు

వెల్గటూర్: ఉమ్మడి వెల్గటూర్ మండల ప్రజలకు పోలీసులు ముఖ్య సూచనలు చేశారు. స్కూళ్లు, కాలేజీలకు వేసవి సెలవుల దృష్ట్యా చెరువులు, కుంటలు, బావులు, నదుల వద్దకు ఈత కొట్టడానికి వెళ్లే పిల్లలపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కోరారు. కోటిలింగాల గోదావరిలో బ్యాక్‌వాటర్ ఎక్కువ ఉండడం, గోదావరిలో మొసళ్లు ఉన్నందున ఈతకొట్టడం నిషేధించినట్లు తెలిపారు.

అన్ని మతాలకు సమాన ప్రాధాన్యం


కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

కొడిమ్యాల: రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలకు సమాన ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అక్షయ ఫంక్షన్ హాల్లో గురువారం రాత్రి ముస్లింలకు ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మేనేని స్వర్ణలత, జెడ్పీటీసీ పొనుకోటి ప్రశాంతి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, కొడిమ్యాల సింగిల్‌విండో చైర్మన్ మేనేని రాజనరసింగరావు, తహసీల్దార్ స్వర్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడా ప్రాంగణం ధ్వంసంపై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కొడిమ్యాల: మండలంలోని డబ్బుతిమ్మాయపల్లిలో క్రీడా ప్రాంగణం ధ్వంసంపై గ్రామస్తులు గురువారం తహసీల్దార్ స్వర్ణకు ఫిర్యాదు చేశారు. మండల రెవెన్యూ అధికారుల అనుమతితో నాచుపల్లి రెవెన్యూ శివారులో సర్వేనెంబర్ 231లో డబ్బుతిమ్మాయపల్లికి చెందిన గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశామని, 18న నాచుపల్లి సర్పంచ్ ఆధ్వర్యంలో జేసీబీతో క్రీడా ప్రాంగణాన్ని ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే క్రీడా ప్రాంగణంలోని క్రీడా పరికరాలు చోరీకి గురయ్యాయన్నారు. క్రీడా ప్రాంగణాన్ని తిరిగి ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్ డబ్బు రాధ, ఎంపీటీసీ డబ్బు జగన్మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ సురుకంటి ముత్యంరెడ్డి, వార్డు సభ్యులు ఎండీ.అక్బరుద్దీన్, శ్రీను, అనిల్, లచ్చిరెడ్డి, నాయకుడు గోల్కొండ రాజు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం


నియామక పత్రాలు అందజేస్తున్న అడ్లూరి లక్ష్మణ్

ధర్మపురి: పట్టణంలో గురువారం యువజన కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం చేపట్టారు. ముఖ్య అతిథులుగా డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరయ్యారు. ఎన్నికైన వారిలో కొండూరి మల్లేశ్ (ఆరెపెల్లి), నార్ల ప్రతాప్(దొంతాపూర్), పాయిల్ శరత్ (రాయపట్నం), గంధం హరీశ్(తీగలధర్మారం), కొండ రాజేందర్ (గాదెపెల్లి), షేక్ ఫరీద్ (రాజారం), కోరుట్ల రాజశేఖర్(జైనా), బొల్లాడి గంగారెడ్డి (కోస్నూర్‌పల్లె), దూడ లక్ష్మణ్ (దమ్మన్నపేట), పెరుమండ్ల వినయ్(నక్కలపేట), మెంగెని వెంకటేశ్(తిమ్మాపూర్), కల్లు రజనీకాంత్(బూరుగుపల్లె), వెల్మల మల్లేశ్(తుమ్మెనాల) మామిడిపెల్లి రాకేశ్(నేరెల్ల), పురంశెట్టి మహేశ్(గోవిందుపల్లె), రాజుకుమార్ (నర్సయ్యపల్లె), సుద్దాల ప్రశాంత్ (నాగారం), ఒడ్డేటి నిరంజన్(కమలాపూర్), కలమడుగు గణేశ్(రామయ్యపల్లె)ను నియమించి నియామక పత్రాలు అందజేశారు.

ఘనంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలు


వెల్గటూర్: కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల: మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదినాన్ని పురస్కరించుకుని టీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి ఆధ్వర్యంలో జగిత్యాలలోని టీఆర్ నగర్‌లో గల గాయత్రి విశ్వకర్మ అనాథ ఆశ్రమంలో వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి కేక్ కట్ చేశారు. నాయకులు రమణ, జానారెడ్డి ఉన్నారు.

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

ధర్మపురి: మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ప్రధాన ఆలయమైన ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో, అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు బొజ్జ రమేశ్ శర్మ, ముత్యాల శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, దేవస్థానం రెనొవేషన్ చైర్మన్ ఇందారపు రామయ్య, ఈవో శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, రెనొవేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెల్గటూర్ మండలంలో..

వెల్గటూర్: మండల కేంద్రంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. వెల్గటూర్ అంబేడ్కర్ కూడలి వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. జెడ్పీటీసీ బి.సుధారాణి, ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, మండల అధ్యక్షుడు చల్లూరి రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం


శంకర్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ధర్మపురి: అంబేడకర్ జాతీయ అవార్డు గ్రహీత కాయితి శంకర్‌ను నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో సన్మానించారు. నియోజకవర్గ అధ్యక్షుడు వేముల ప్రమోద్‌కుమార్, గౌరవ అధ్యక్షులు ఓరుగంటి బాపు, క్యాదాసు స్వామి, దొంతర్ల సురేశ్, రాష్ట్ర నాయకులు సాతర్ల మహేశ్, రమేశ్, దళిత సంఘాల నాయకులు రాజమల్లయ్య పాల్గొన్నారు.

23 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

పెగడపల్లి: మండంలోని 23 గ్రామ పంచాయతీల్లో రబీకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలు కోసం 25 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలవ్యాప్తంగా 25వేల ఎకరాల వరిపంట సాగు చేయగా సుమారు 3.50లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించేందుకు అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. నంచర్ల, నందగిరి, పెగడపల్లి సహకార సంఘాలతో పాటు ఐకేపీ (సెర్ప్) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. పెగడపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో పెగడపల్లి, దోమలకుంట, ఆరవెల్లి, మద్దులపల్లి, వెంగళాయిపేట, సుద్దపల్లి, శాలపల్లి, లింగాపూర్, నంచర్ల సహకార సంఘం ఆధ్వర్యంలో రాంనగర్, నంచర్ల, కీచులాటపల్లి దీకొండ, ఎల్లాపూర్, నందగిరి సహకార సంఘం ఆధ్వర్యంలో నందగిరి, అయితిపల్లి, నామాపూర్, మ్యాకవెంకయ్యపల్లి, ఐకేపీ నుంచి మద్దులపల్లి, బతికపల్లి, రాములపల్లి, ల్యాగలమర్రి, నర్సింహునిపేట, సుద్దపల్లి, రాజరాంపల్లి, రాంబద్రునిపల్లి, దోమలకుంట, సుద్దపల్లి, నంచర్ల గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు అధికారులు వివరించారు.

వరిపంట క్షేత్ర ప్రదర్శన

పెగడపల్లి: మండలంలోని నామాపూర్ గ్రామంలోని చాడ లింగారెడ్డి అనే రైతు పొలంలో సహజ కంపెనీకి చెందిన 179 వైశాలి రకం వరిపంట పొలంలో గురువారం క్షేత్రస్థాయి ప్రదర్శన చేపట్టారు. మహాలక్ష్మి సీడ్స్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కంపెనీ ప్రతినిధి రామోహన్‌రావు మాట్లాడుతూ ఈ వరిరకం తెగుళ్లను తట్టుకుని అధికబడి వస్తుందన్నారు. సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ సంతోష్, ఎంపీటీసీ రజిత, కంపెనీ డీలర్ రాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షిక వేడుకలు


సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న సర్పంచ్

కోరుట్లరూరల్: మండలంలోని సంగెం, గుమ్లాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం వార్షిక వేడుకలు నిర్వహించారు. అనంతరం ఐదేళ్లు పూర్తయిన చిన్నారులకు ప్రిస్కూల్ సర్టిఫికెట్లను సర్పంచులు అందజేశారు. సర్పంచులు చెప్యాల నర్సయ్య, యదగిరి అమ్మాయి, తోట శారద, సూపర్‌వైజర్ షమీమ్ సుల్తానా, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, రజిత, విజయలత, రాఘ మంజురి, రజిత పాల్గొన్నారు.

ఆటపాటల విద్యతోనే పిల్లల్లో నైపుణ్యం

జగిత్యాలరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటల విద్యతోనే పిల్లల్లో నైపుణ్యాభివృద్ధి జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని మోరపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రిస్కూల్ వార్షికోత్సవం నిర్వహించారు. హెచ్ఎం శైలజ, శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు సుగుణ, అంగన్‌వాడీ టీచర్లు పద్మ జరాణి, జమున, శైలజ పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని బోర్నపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ప్రిస్కూల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పాదం లత, ఎంపీటీసీ కవిత, ఉపసర్పంచ్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు రాపర్తి నర్సయ్య, శ్రీలత పాల్గొన్నారు.

మేడిపెల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ప్రిస్కూల్ డే కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ క్యాతం వరలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్య పాల్గొన్నారు.

ధర్మపురి: మండలంలోని దొంతాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం వార్షిక వేడుకలు నిర్వహించారు. సూపర్‌వైజర్ కుసుమ, అంగన్‌వాడీ టీచర్లు జమున, విజయ, సువర్ణ, రజిత ఉన్నారు.